


# ప్రయాణం

హైదరాబాద్ నుంచి కడప వెళ్ళే డీలక్స్ బస్సు బయలుదేరగానే పక్క సీటు హక్కుదారుడు నా ముఖంలోకి ఎగాదిగా చూశాడు.

స్నేహంగా నవ్వాను.

"యాపూరబ్బీ?"అన్నాడు.

"కడప!"

"సొంతూరు?"

"అనంతపురం!" అన్నానో లేదో, " అట్టా జెప్పుమడి" అన్నాడు.

అంటే అర్థం ఏమిటో నాకు తెలియలేదు. పరిచయం చేసుకొన్నాను.

ఆ మనిషికి డెబ్బై ఏళ్ళుంటాయి. పేరు బాలిరెడ్డి. రైతు పెద్దకుటుంబం. పిల్లలంతా స్థిరపడ్డారు. పొలం చూసుకొనే వాడు లేడు.కొడుకులు నలుగురు. అందరూ ఉద్యోగులు. కూతుళ్ళు ముగ్గురు. భార్య లిద్దరు. ఇంట్లో అయిదుగురు ఆడవాళ్ళు మనుమలు, మనుమరాళ్ళు ఇల్లంతా బిలబిలలాడుతుంటారు. బాలిరెడ్డి సింహం. ఇంట్లో అంతా గోవులు. బాలిరెడ్డి గర్జిస్తే ఇల్లంతా పరారు. నిశ్శబ్దం.

అల్లుళ్ళు ఇల్లరికం వచ్చారు. పొలం పనులు చూసిపెడుతున్నారు. బాలిరెడ్డి కడపలో ఇల్లు కట్టించుకొన్నాడు. చేరాడు. ఎప్పుడయినా పల్లెకు పోయి పొలాలు చూసివస్తాడు.

"ఆ నా కొడుకులకి తినేకి లే, ఈ నా కొడుకులు తింటండారు" అది తిట్టటం కాదు.



మాట వరస అంతే! అల్లుళ్ళు వస్తూపోతూ ఉంటారు.

"ఆళ్ళే వచ్చారు. ఇచ్చారు. పోతారు."

అల్లుళ్ళే కావలసింది తెచ్చి ఇస్తుంటే "అయితే నీ పని రొక్కాన పడింది" అన్నానో లేదో, అందుకొన్నాడు.

" మీ జిల్లోళ్ళతో సావొచ్చి పడిందబ్బీ" అన్నాడు. "యాంది? " అనగానే "తెలీదా?" అన్నాడు. బదులు చెప్పకముందే " మీ జిల్లోళ్ళు కూడక బాంబులు ఏత్తన్నారు సుడీ అదీ మంట"

విషయం మారింది. అదీ అర్థమయింది.

"పెద్ద మంచి నువ్ గాదబ్బీ - మీ జిల్లోళ్ళూ" నేనింకా ఏమీ మాట్లాడలేదు. "బాంబులెయ్యాలంటే మేమే ఎయ్యాల. మీ వోళ్ళొలైన్నారే పోటీకి. మించుతారా? మొగ్గోళ్ళా?"

★ ★ ★

అవునన్నా అందుకొంటాడు బాలిరెడ్డి. కాదన్నా అంటుకొంటాడు. మౌనం మహారాజ లక్షణం. మాట్లాడలేను.

అయినా బాలిరెడ్డి ఊరుకోలేదు. "మా జిల్లాలోకి మీ జిల్లా వాడికేం పని? పెద్ద మంచి' అన్నాడు.

నేను కడప పోకూడదని బాలిరెడ్డి అభిప్రాయమని నేను భావించలేదు.

"మీ జిల్లావోడు మీ జిల్లా రాజకీయాల్లో పీకల దాంకా మునిగితే తప్పులే. మా జిల్లాలోకి ఎల్లుకోరాదు. ఏం మాట్లాడవేం?"

"నిజమే" చెప్పకతప్పలేదు.

"వొత్తే"

"తగాదే!"

"బాంబులే!" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"నీ ఇంట్లోకి నేనొత్తే నువ్వూరుకుంటా? ఊరుకోవు? ఏవంటా? ఆ మాట్టాడేం?

"ఊరుకోను"

"ఎవుడి జిల్లాలో ఆడు ఆడేడుపాడేడవాలి"

"నిజమే!"

"సచ్చే సావొచ్చినా తట్టుకోవాలి"

"నిజమే"

"నువ్వొకడుగేత్తే నేను రెండేచ్చా"

"నిజమే". నిజమే అనకపోతే బాలిరెడ్డి ఊరుకొనేటట్టు లేడు.

బస్సు జడ్చర్లలో ఆగింది.

"తియ్ నన్ దిగనియ్" అన్నాడు బాలిరెడ్డి.

"తట్కో నేనూ దిగాల్ల!"

"లెయ్‌మడి!" తొందరపెట్టాడు. దిగాను. సాధారణంగా బస్సు ప్రయాణంలో నేను

ఆగినచోటల్లా దిగను. రాత్రి ప్రయాణంలో అసలు దిగను. బాగా నిద్రపోతాను. బస్సు ఉయ్యాల ఊపుతుంది. నిజానికి హైదరాబాదులో నిద్రపడితే కడపలో మెలకువ రావాలి. బాలిరెడ్డి మూలాన నిద్రపట్టలేదు. బస్సు ఉదయానికి కడప చేరుతుంది. పగలంతా పని. రాత్రికి మళ్ళీ బస్సు ప్రయాణం. అందువల్ల ప్రయాణంలో నిద్ర అత్యవసరం.

బాలిరెడ్డి టీ బంకు దగ్గరకు పోయాడు. రెండు టీ గ్లాసులు తీసుకొన్నాడు. తాగుతూ ఒకటి తెచ్చి "తాగు" అన్నాడు. "వద్దు" అన్నాను. " ఏం అన్నాడు తాగనన్నాను. తాగితే నాకు నిద్ర పట్టదు. టీ పారబోశాడు. గ్లాసులు తిరిగి ఇచ్చాడు.

బస్సులో కిటికీ సీటు బాలిరెడ్డిది. పక్క సీటు నాది. నేను లేవందే బాలిరెడ్డి బైటికి పోలేడు. లోపలికి రాలేడు. లావుపాటి మనిషి. కాయపారు శరీరం. భద్రంగా ఉన్నాడు. బస్సు ఆగినచోటల్లా టీ తాగేటట్టున్నాడు. బాలిరెడ్డి దిగుతూ ఎక్కుతూ ఉంటే తప్పేం లేదు. అతడికి నష్టమూ లేదు. కష్టం నాకే! నిద్ర చెరుపు.

నేను కిటికీ సీటులో కూర్చుంటే రోడ్డు పక్క అటూఇటూ తిరుగుతున్నాడు. డ్రైవరు ఎక్కిందాకా ఎక్కేట్టు లేడు. నేను ముందుగా ఎక్కి కిటికీ సీటులో కూర్చున్నాను.

డ్రైవరు ఎక్కాడు. జనం లెక్క చూసుకొన్నాడు. హారను వేశాడు. అతను అప్పుడెక్కాడు. సీటు దగ్గరకు బస్సు సముద్రంలో ప్రజా జలంలో ఈదుకొంటూ వచ్చాడు.

" నా సీటులో నువ్ గూసో, నీ సీటులో నే గూసుంటా, నా నిద్దర జెడదు. నీ రాక పోకలకిబ్బంది ఉండదు" అన్నాను.

"అట్టా కథలు నా దగ్గెర చెప్పొద్దు" అన్నాడు బాలిరెడ్డి.

నాకు విషయం అర్థమయింది. నేను లేచి, అతణ్ణి రానిచ్చి నా సీటులో నేను కూర్చున్నాను.

"గాలుండాల్లే" అన్నాడు. నేనేం మాట్లాడలేదు. "ఇదసల్సిసల్ మీ జిల్లా రాజకీయం!" అన్నాడు.

"అంటే!" అన్నాను.

"అంటే అంటావా పెద్ద మంచి, నా సీటులో నువ్ ముడిపెట్టటం మా జిల్లా రాజకీయంలో మీ జిల్లావోడు మూతి బెట్టినట్టు లేదా అంట? " అని కసురుకొన్నాడు.

ఏం మాట్లాడినా ఊరుకోడని నేను మౌనం వహించాను.

బాలిరెడ్డి కొంచెం సేపు గుర్రుగుర్రుమన్నాడు. మళ్ళీ మాట్లాడలేదు. నిద్ర

పోతున్నాడనుకొన్నాను. కానీ మెలకువగా ఉన్నాడు. గుడ్లు పత్తికాయల్లాగా ఉన్నాయి.

"యేం? దొంగనాకొడుకును జూచినట్లు జూత్తన్నా?" అని అడిగాడు.

"యాంలే!" అని ఊరుకొన్నాను.

బస్సు కుదుపువల్ల నాకు నిద్ర ముంచుకువస్తూ ఉంది. ఎప్పుడో నిద్ర పట్టింది. ఉన్నట్టుండి అదిరిపడి నిద్ర లేచాను. బస్సు సడన్ బ్రేకు వేయలేదు. అంత కుదుపేం వచ్చింది? తెలియలేదు.

మా ఇద్దరికీ మధ్య ఒకే ఒక్క హేండ్ రెస్ట్ ఉంది. ఇద్దరి చేతులూ దానిమీదే పెట్టుకోవచ్చు. బాలిరెడ్డి హేండ్ రెస్ట్ మీద వెనకగా, నా చేయి ముందుగా ఉండగా నిద్ర పోయినట్లు గుర్తు. మెలకువ వచ్చినప్పుడు నా చేయి హేండ్ రెస్ట్ మీద లేదు. జారిపోయి ఉండవచ్చుననుకొన్నాను. మళ్ళీ నిద్ర వస్తుంటే చేయి దాని మీద పెట్టాను. అయినా బాలిరెడ్డి చేయి ఊరుకోలేదు. నా చేతిని నెట్టివేసింది. అతను నిద్ర పోలేదు. పత్తిగుడ్లు, బుద్ధి పూర్వకంగానే నెట్టివేశాడు కానీ నా చేయి అక్కడ పెట్టుకొంటే బాగుంటుంది. బాలిరెడ్డికి తగలకుండా, అడ్డం కాకుండా చేయి పెట్టుకొన్నాను. అతనూరుకోలేదు. చాచినెట్టాడు. నా చేయి వచ్చి నా ఒళ్ళో పడింది.

నేను చేయి అక్కడ పెడితే బాలిరెడ్డి ఊరుకోడని స్పష్టమయింది. ఎన్నిసార్లు పెడితే అన్నిసార్లు నెడతాడని తెలిసిపోయింది.

నిజానికి నేను కూడా చేయి పెట్టుకోవడానికి హక్కు, ఉండి ఉంటుంది. టిక్కెట్టు కొనటంతోనే అది నాకు సంక్రమించి ఉంటుంది.

నా చేయి నెట్టివేసిన బాలిరెడ్డి నా హక్కునే నెట్టివేసినట్లు లెక్క. నా హక్కును నేను పోగొట్టుకోకూడదు. హక్కు కాపాడుకోవటం వల్ల అల్లరి అవుతుంది. అది ఎంత దూరమయినా పోవచ్చు. వెంటనే వచ్చిన నష్టం నిద్రలేమి.

'హక్కు కావాలా? నిద్ర కావాలా?' అని, నిద్రే అని నిర్ణయించుకొన్నాను.

మెక్‌మెహన్ రేఖ లాగా ఉంది హేండ్ రెస్ట్. ఓర్చుకోకపోతే చైనా యుద్ధం తప్పదు.

అది తన హక్కులాగా భావిస్తున్నాడు బాలిరెడ్డి. దాని మీద ఎవరినీ చేయి వేయనిచ్చేటట్టు లేడు. అనంతపురం వాణ్ణి అసలు దాని దరిదాపుల్లోకి రానిచ్చేటట్లు లేడు.

నా చేయి, నా వొడి చాలు, దాని మీద చేయి వేయలేదు. ఒళ్ళో పెట్టుకొన్నాను. ఇబ్బందిగా ఉంది. మామూలుగా లేదు. అసహజంగా ఉంది. పొట్ట మీద పెట్టుకొన్నాను. బాగాలేదు.

నొప్పిగా ఉంది. బాలిరెడ్డి భయంకరంగా ఉన్నాడు. అయినా చేయి అనీ అనకుండా రెస్ట్ పక్కకు జరిపాను.

సరిహద్దు రేఖ దాటిన శత్రువును దండించినట్లు చాచి ఒక్కటిచ్చాడు. నా చేయి నా ప్రమేయం లేకుండా ఎగిరివచ్చి నా ఒళ్ళో వాలింది.

మళ్ళీ ప్రయత్నించలేదు. నిద్ర పట్టింది.అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. చేయి విపరీతంగా నొప్పిగా ఉంది. రెండో చేతికి మొరపెడుతూ ఉంది. దాని సానుభూతి కోసం బిచ్చగత్తెలా అడుక్కొంటూ ఉంది.

నేను నిద్దట్లో రెస్ట్ మీద చేయి పెట్టి ఉంటాను. బాలిరెడ్డి గమనించి ఉంటాడు. శత్రువు నాగలి తన పొలం గట్టు దున్నినంత కోపం వచ్చి ఉంటుంది విసిరికొట్టి ఉంటాడు.

ఎన్నో మంచి పనులు చేయదగ్గ చేయి, దేబిరింపుగా కుయ్‌కుయ్‌మనే కుక్కపిల్ల లాగా తోక ముడుచుకొని పడుకొంది. పడ్డచోటు నుంచి లేవలేదు. అయినా సలపరం.

చేతిని అంతగా విసిరికొట్టకపోతేనేం? అని అడుగుదామనుకొన్నాను అడగటం మంచిది కాదనిపించింది.

బాలిరెడ్డి మాట తీరు వంటిదే చేత తీరు అని తెలిసి వచ్చింది. మాటో చేతో మేల్కొనే ఉంటుంది. రెండూ మేల్కొంటే బాంబులే!

రెస్ట్ మీద నాకు హక్కు లేదు. గుర్తించాను. అది షాక్ కొట్టే విద్యుత్తు తీగె. అవతల హై వోల్టేజి లైనుంది. తాకితే షాకే!

మీసాల బాలిరెడ్డి వృద్ధ సింహం లాగా ఉన్నాడు. బోను లేదు. అదిప్పుడు కృద్ధ సింహం. నిద్రలేదు. తాకితే పీకుతుంది.

నిద్ర పట్టబోయే ముందు చేతిని బతిమాలి బుద్ధిగా ఉండమని హెచ్చరించి, జాగ్రత్తపడి, మచ్చిక చేసుకొని బతిమాలి సరేనంటే సరేనని నిద్రపోబోయాను. టక్కున మెలకువ వచ్చింది. బస్సు ఆగింది. కర్నూలు, రూలు ప్రకారం బాలిరెడ్డి దిగాలి. నేను లేవాలి.

"దిగాలా?" ప్రశ్నించేనో లేదో "దిక్క?" అని ఎదురు ప్రశ్నించాడు.

లేచి నిలబడ్డాను దిగిపోయాడు. మళ్ళీ వచ్చినప్పుడు మౌనంగా నిలబడ్డాను మాట్లాడకుండా కూర్చున్నాడు.

గవర్నరు వస్తుంటే బరాబరులు తీర్చినట్లుంది. నేను లేవటం కూర్చుండటం. సమ్మె జనం వచ్చినప్పుడు షట్టర్లు మూసినట్లుంది నా వ్యవహారం.

ఆవులించి, వళ్ళు విరుచుకొని, కాళ్ళు, చేతులూ జోడించి నెమ్మదిగా బయలుదేరింది డీలక్స్ బస్సు మహాసొగ్గా, మహా నాజూగ్గా, మహా వయ్యారంగా.

కర్నూలు దాటింది.

నిద్ర నా కనురెప్పల మీదికి వచ్చి డాన్సు ప్రాక్టీసు చేస్తూ ఉంది. అతడి కళ్ళు బస్సు హెడ్‌లైట్లు లాగా విప్పారి ఉన్నాయి.

హేండ్ రెస్ట్ మీంచి చేయి తీస్తాడేమో నని చూశాను. తీయలేదు.

లంకెల బిందెల్ని చుట్టుకొన్న నాగు బాములాగా చేయి స్థిరంగా ఉంది. చేను గనిమలాగా ఘనంగా ఉంది. బస్సులో తానున్నంతసేపూ దాన్ని తాను వదలడని స్పష్టమయింది.

చేయి ఇంకా నొప్పిగానే ఉంది. బొప్పి కట్టలేదు. గాయం కాలేదు. కొట్టకపోయినా తిట్టినందుకే ఏడ్చే పసిపిల్లవాడి తంతులాగా ఉంది. బుజ్జగించి చేతిని నిద్రపుచ్చి నేనూ నిద్రలోకి జారుకొన్నాను.

బస్సు నదిలో పడుతున్నట్లు అనిపించి ఉలిక్కిపడి లేచాను. హోరు! బస్సు హారను కాదు. ఆ హోరు పుట్టే ఊరు కోసం చూస్తుంటే నోరు కనిపించింది. బాలిరెడ్డి నోరు. నోరూ ముక్కూ ఏకధాటిగా హోరును ప్రసవిస్తున్నాయి. గండు పిల్లులు కొట్టాడుకొంటున్నట్లుంది గురక, నా నిద్ర పరారయింది.

బాలిరెడ్డి నిద్రపోడని నాకున్న నమ్మకం వమ్ము అయింది. నిద్రపోతున్నాడు. ఎంతో ఆనందించాను. గురక నన్ను బాధించలేదు. నాకు నిద్ర పట్టకపోతే పోయింది. బాలిరెడ్డి నిద్రపోతున్నాడు అదే పదివేలు!

బస్సు హారనుకు, బాలిరెడ్డి హోరుకు జనం మేల్కొన్నారు. అందరూ మా వైపు చూస్తున్నట్లు సందేహం.

అతను ఉన్నట్టుండి మేల్కొన్నాడు గురక ఆగిపోయింది. హోరు తగ్గింది. కళ్ళు తెరిచాడు. పత్తిగుడ్లు హెడ్ లైట్లు, బస్సుపోతూ ఉంది.

మైదుకూరులో బస్కెక్కి వచ్చాడు. వచ్చి కిటికీ సీటులోకి పొమ్మన్నాడు "యాం?" అంటే "సలిబెడతా ఉండ్లే?" అన్నాడు.

"నాకూ సలే!" అన్నాను.

"నీకేం నువ్ పిల్లోనివి"

"నాకరవయ్యేళ్ళు?

"పదేళ్ళు పిల్లోనివిలే లేయ్"

తప్పదని తేలిపోయింది. లేచాను, కిటికీ సీట్లో కూర్చున్నాను. కిటికీ మూయబోయాను. "అగు వద్దు, తియ్" ఆజ్ఞాపించాడు.

"యాం?" అంటే "గాలొద్దా? సస్సావ్" అన్నాడు.

నేను మళ్ళీ మాట్లాడలేదు. బస్సు వేగంగా పోతూ ఉంది. ఈదర గాలి. టవలు నెత్తి మీదికి లాక్కున్నాను.

"గాలెట్టుంది?" అన్నాడు "మండుతుంది" అందామనుకొని ఏమీ అనలేదు.

బాలిరెడ్డి ఏవేవెూ మాట్లాడుతూనే ఉన్నాడు అడుగుతున్నాడు. "ఆఁ" అంటున్నాడు."నిన్నే!" అని హెచ్చరిస్తున్నాడు ఉసిగొలుపుతున్నాడు.

"పొద్దుటేలకే నోరు బడిబోయిందా?" అన్నాడు. అయినా మాట్లాడలేదు.

వాగి వాగి, వాగలేక చుట్టముట్టించాడు. కంపు "సలి" అన్నాడు. కిటికీ మూశాడు. కంపు బస్సును చుట్టుకొంది.

కండక్టరు లేడు. డ్రైవరు సీటు వదలడు. బాలిరెడ్డి చుట్ట మానడు. మానమనే వాళ్ళు లేరు. అందరికంటే కష్టం నాకే, నేనే వద్దనాలి. వద్దంటే మానడు. పైగా మాట్లాడతాడు. అది భరించటం కష్టం. చుట్టకంపే శ్రేష్ఠం.

తెల్లవారుతున్నప్పుడు బస్సు కడపలో ఆగింది. అందరూ దిగిందాకా నేను దిగలేను.

"యాడికిబోతా?" ప్రశ్నించాడు

నేను బదులు చెప్పలేదు.

"మాయింట పోదాం.రా!" ఆహ్వానించాడు.

ఇద్దరం దిగగానే డ్రైవరు వచ్చి బ్రీఫ్‌కేస్ తీసుకొన్నాడు.

"కారెవుర్ది? నీదా? ఏంజేత్తా?"

నేనేం జవాబు చెప్పలేదు.

"నేనూ నీతో వచ్చా మా యింటికాడ దింపు"

నేను మాట్లాడకుండా వెళుతుంటే "యేందిర్నాకొడుకీడు మాట్టాడ్డు" అన్నాడు. నేను

విన్నాను. వెనక్కు కూడా తిరిగిచూడలేదు.

"యేందిరా నువ్ మాట్టాడవ్. ఒరే! దొంగనాకొడుక ముచ్చునాకొడక, మీ జిల్లా ముచ్చుబుద్ధి బోనిచ్చుకోక పోతివ్ మోసగాళ్లు దొంగనా కొడుకులు.' నాది అనంతపురం కాదని నాకు తెలుసు. బాలిరెడ్డి కెట్లా తెలుస్తుంది? నాది కానీ, బాలిరెడ్డిది కానీ, ఏ జిల్లా అయినా మానవ స్వభావంలో ఒక మారుమూల ప్రాంతంలో ఉండే మచ్చ అనివార్యమైన జీవలక్షణం. నేను కారులో కూర్చున్నాను. కారు బయలుదేరింది.

బాలిరెడ్డి తిట్టితిట్టి, తిట్టటానికి మనిషి లేక ఏడుస్తాడేమోనని భయంగా ఉంది.

★